క్లుప్తంగా

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి



అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. రాజోళి మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణకు రూ. 60 వేలు, దయాసాగర్‌కు రూ.21 వేలు, సదనమ్మకు రూ. 19500, మాధవికి రూ.8 వేలు, వడ్డేపల్లి మండలం రామాపురానికి చెందిన తిరుమలేష్‌కు రూ. 26,500 మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రఘురెడ్డి, నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు భోజనం పంపిణీ

అయిజ: మున్సిపాలిటీలో హోటల్ నిర్వహిస్తున్న తిరుమలేష్ అనే వ్యక్తి తన వంతు సాయంగా రోడ్డు పక్కన ఉన్న అనాథలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు భోజనం పంపిణీ చేసి మంచి మనసు చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హోటళ్లలో, శుభకార్యాల్లో మిగిలిపోయిన ఆహారాన్ని వృథా చేయకుండా తమదృష్టికి తీసుకొస్తే ఆహారాన్ని స్వయంగా తీసుకెళ్లి అనాథలకు, రోగులకు అందజేస్తామని పేర్కొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా



అయిజ: మున్సిపాలిటీలోని పాత బస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్యన పెద్ద వాగుపై నిర్మించిన బ్రిడ్జికి ఆనుకుని ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. శనివారం మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా వాగులోకి వెళ్తుంది. దీంతో పలు కాలనీల్లో తాగునీటి సమస్య తలెత్తింది. ఇలాంటి లీకేజీలు పట్టణంలో తరుచూ జరుగుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు పైప్‌లైన్‌లను పర్యవేక్షించి నీటివృథాను అరికట్టాలని కోరుతున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



గద్వాల అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగానికి పెద్ద పీట వేస్తూ గద్వాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణానికి జీవో విడుదల చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ.. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత సీఎం రేవంత్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేసిన వెంటనే స్పందించి గద్వాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్‌కు జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లత్తీపురం వెంకట్రామిరెడ్డి, భాస్కర్ యాదవ్, మహేష్, రామకృష్ణ, రాజశేఖర్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

హక్కుల పరరక్షణలో యువతది కీలకపాత్ర



రాజోళి: బాలల హక్కులను పరిరక్షించడంలో యువకులు, యువజన సంఘాలది కీలక పాత్రని తహసీల్దార్ రామ్మోహన్, ఎంఈఓ భగీరథరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బాలల హక్కుల పరిరక్షణ– యువజన సంఘాల పాత్ర అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు, ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మల్దకల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ

ఎర్రవల్లి: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డీపీఓ శ్యాంసుందర్ అన్నారు. శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల, కేజీబీవీ పాఠశాలలను ఆయన సందర్శించారు. వంట గదులు తనిఖీ చేసి నిత్యావసర సరుకులను, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఆయా పాఠశాలల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ అన్నారు. శనివారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఎస్సీ హాస్టల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, వార్డెన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. దాని కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. శనివారం మండలంలోని ఎర్సందొడ్డిలోని పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజన వివరాలను వంట ఏజెన్సీలను అడిగి తెలుకున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శివరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవపాడు: విద్యార్థులకు భోజనం విషయంలో నాణ్యత పాటించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శాంతిరాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో భోజనం, వంట సరుకులు పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, ఉపాధ్యాయులు లక్ష్మన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌తో కలిసి విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం హాస్టల్, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, భోజన సిబ్బంది పాల్గొన్నారు.



రాజోళి కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న అధికారులు



ఎర్రవల్లి గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ శ్యాంసుందర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సీఈఓ కాంతమ్మ



ఎర్సందొడ్డి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

భవానీమాత ఆలయానికి రూ.లక్ష విరాళం



విజేతగా నిలిచిన బిజ్జారం జట్టు



విరాళం అందజేస్తున్న భక్తులు

గట్టు : మండల కేంద్రంలోని భవానీమాత ఆలయానికి శనివారం దాతలు విరాళాలు అందజేశారు. కర్నూలుకు చెందిన కాటేగార్ కుమార్ తండ్రి చంద్రప్పలు రూ.1,00,021లు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గట్టుకు చెందిన వీణారెడ్డి, సంజీవరెడ్డి దంపతులు భవాని మాతకు ముక్కుపుడక బహూకరించారు. ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు కేపీ అంబుసా, సంఘం సభ్యులు ఈరన్న, చంద్రమోహన్, లక్ష్మణ, లక్ష్మీనారాయణలకు విరాళాలు అందజేశారు. దాతలను సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

కబడ్డీ విజేత బిజ్జారం జట్టు ..

మండల కేంద్రంలో జాతర సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా బిజ్జారం జట్టు నిలిచింది. శనివారం విజేతలకు ఎస్ఐ మల్లేష్, మాజీ సర్పంచ్ యుగంధర్, రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ, రిటైర్డ్ హెచ్ఎం గోవిందప్ప, కాంట్రాక్టర్ కృష్ణమూర్తి, శ్రీనాథ్‌లు బహుమతులు అందజేశారు. గట్టు భవానీమాత జాతర సందర్భంగా మాజీ సర్పంచ్ ధనలక్ష్మీ ఆధ్వర్యంలో 3 రోజుల పాటుగా జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. బిజ్జారం జట్టుకు రూ.20 వేలు, భూంపురం జట్టుకు రూ.15 వేలు, పచ్చర్ల జట్టుకు రూ.10 వేలు ప్రైజ్‌మనీ అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నాగరాజు, లెక్చరర్లు రాజగోపాల్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



ధరూరు: బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే వంటి మహనీయుల ఆశయాలు కొనసాగించే సాధకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అని సోషల్ వర్కర్ శ్రీనివాస్ అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వీరేష్, రాజు, లేమిరాజు, రాజేష్, ప్రవీణ్, అశోక్, ప్రతాప్, పవన్, పీటర్, భాస్కర్, మనోహర్, ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: మాజీ ఐపీఎస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్పీ టీం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో తన నివాసంలో కేక్ కట్ చేసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అతిఖుర్ రహ్మాన్, బస్వరాజ్, మోనేష్, గంజిపేట రాజు, కుర్వపల్లయ్య, మాజ్, రాజునాయుడు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



అయిజలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

అయిజ: మహారాష్ట్రలో ఎన్నికల్లో ఎన్‌డీఏ (బీజేపీ) కూటమి విజయం సాధించడంతో మండల కేంద్రంలో శనివారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకుని, బాణా సంచా కాల్చారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీకి అన్ని రాష్ట్రాల్లో ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో భీమసేనరావు, గోపాలకృష్ణ, ప్రదీప్ కుమార్, లక్ష్మణాచారి, లక్ష్మణ్ గౌడ్, రాజశేఖర్, ఇబ్రహీం, వెంకటేష్, నరసింహ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ పెరిగింది ..

శాంతినగర్: బీజేపీకి గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ పెరిగిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటి శాంతినగర్ పట్టణంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో 593 పోలింగ్ బూత్‌ల్లో మండల, పట్టణ ప్రాంతాల్లో సాధారణ, క్రియాశీల సభ్యత్వాలు రెట్టింపు స్థాయిలో జరిగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ, గవ్వల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన



ఉండవెల్లి: మండల కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం విధివిధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న మండల, జిల్లా స్థాయిలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కో చైర్మన్ అందే రాంబాబు డిమాండ్ చేశారు. పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ నుంచి ర్యాలీ చేపట్టి ఐడీవోసీ ముందు నిరసన వ్యక్తం చేశారు. నిరసనకు బీఆర్ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అతిఖుర్ రహ్మాన్, ఎమ్మార్పీఎస్ నాయకులు, బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కుర్వపల్లయ్య మద్దతు తెలిపారు. ఆనంతరం కలెక్టరేట్ ఏఓ వీరభద్రప్పకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 390 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 570 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వివరించారు.

వేసెక్టమీపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో డాక్టర్ మధుబాబు

రాజోళి: కుటుంబ నియంత్రణలో పురుషుల పాత్రలో భాగంగా వేసెక్టమీ ఆపరేషన్‌పై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, వ్యాసెక్టమీ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో వైద్య బృందంతో కలిసి పురుషులకు కోత లేకుండా నిర్వహించే కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌పై వివరించారు. ఆపరేషన్ చేయించుకునే వారికి ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, జయప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా విజయోత్సవాలపై కళాజాతా



గట్టు తహసీల్దార్ కార్యాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గట్టు : ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలపై కళాజాతను శనివారం తహసీల్దార్ సరితారాణి, ఎస్ఐ మల్లేష్, డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌లు ప్రారంభించారు. డీపీఆర్ఓ అరిఫుద్దీన్ ఆధ్వర్యంలో రాహుల్ కళాబృందం సభ్యులు గట్టుకు చేరుకున్నారు. తహసీల్దార్‌ను కలిసిన అనంతరం కళాకారులు ఆయా గ్రామాలకు తరలివెళ్లారు. తహసీల్దార్ కార్యాలయం, మాచర్ల, బోయలగూడెం గ్రామాల్లో కళాకారులు ప్రభుత్వ పథకాలపై ఆట, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు కేశవులు, రమాదేవి, రాహుల్, హజ్రత్, భూపతి, కృష్ణ, స్వామి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



డీడబ్ల్యూఓను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూఓ) సుధారాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, అమరవాయి వీరభద్ర స్వామి, పాల్వాయి అడవి ఆంజనేయ స్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక మాసం సందర్భంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖరరావు, దీరేంద్ర దాసు, బాబురావు, నాగరాజు శర్మ, సిబ్బంది శ్రీను, ఉరుకుందు, కృష్ణ, రంగస్వామి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య అధికారులు

మల్దకల్: పాడి పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి యామినీసాయి, విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని నీలిపల్లి గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులకు గర్భకోశ వ్యాధి నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషా, పశు వైద్య సిబ్బంది రాజేంద్ర, ప్రగతి, వంశీకృష్ణ, శాంతిరాజు, రాజగోపాల్‌రెడ్డి, దేవరాజు, ఆంజనేయులు, కృష్ణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడిన నేత



పురుషోత్తం స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామంలో శనివారం ప్రజా సంఘాల నాయకుడు పురుషోత్తం వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుందర్ రాజారావు మాట్లాడుతూ.. ఎక్కడ ప్రజలకు అన్యాయం జరుగుతుందో అక్కడకు పురుషోత్తం వెళ్లేవాడన్నారు. ప్రాణాలకు తెగించి సమస్యలపై పోరాడేవాడని తెలిపారు. వివిధ గ్రామాల్లో యువజన సంఘాలు స్థాపించి యువతను చైతన్యవంతులను చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, సత్యన్న, మహేష్, ప్రకాష్, నాగన్న నాయుడు, రంగన్న, సీతారాముడు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు స్ఫూర్తిదాయకం



నగర సంకీర్తనలో సత్యసాయి భక్తులు

గద్వాలటౌన్ : భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ఓంకారం, సుప్రభాతం, మహానగర సంకీర్తన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు భజనలు చేస్తూ పాటలు పాడుతూ సంకీర్తనలు పాడారు. సత్యసాయి మందిరంలో అన్నదానం చేశారు. రాత్రి చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ఉయ్యాల సేవను వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



చాగాపురంలో ఓటింగ్ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేందర్

ఇటిక్యాల: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. శనివారం ఇటిక్యాల మండల కేంద్రంలోని షాబాద్, చాగాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి అక్కడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫారం–6 ద్వారా ఓటరు నమోదు, ఫారం–7 ద్వారా అభ్యంతరాలు, ఫారం–8 ద్వారా అడ్రస్ మార్పు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ భీమ్‌సేన్‌రావు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను కేటీదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని చింతలకుంటకు చెందిన కొందరు బల్గెర నుంచి చింతలకుంట వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు చింతలకుంట శివారులో పట్టుకున్నారు. నిందితులు అశోక్, జనార్దలన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గద్వాల క్రైం: అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గద్వాలకు చెందిన జంబు వెంకటేష్‌గౌడ్ గద్వాల పట్టణ శివారులోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని టిప్పర్ ద్వారా తరలిస్తున్నారు. టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి టిప్పర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శుక్రవారం ఆలయం ముందున్న హుండీని గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లి హుండీ పగులగొట్టి అందులోని డబ్బులు, కానుకలు దొంగతనం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఇదే ఆలయంలో గంటలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరాఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: టౌన్ ఫీడర్–4 ఫీడర్ పరిధిలో శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్ కట్టడాలను మార్చనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు పట్టణంలోని పాతహౌసింగ్ బోర్డు, 2వ రైల్వే గేటు కాలనీ, రాధాకృష్ణకాలనీ, టీరెల్లి రోడ్డు, హమాలీ కాలనీ, వేణుకాలనీ, ప్రభుత్వాసుపత్రి ఏరియా అంబేద్కర్ చౌక్, వీవర్స్ కాలనీలో సరాఫరా నిలివేయనున్నట్లు పేర్కొన్నారు.

నిలిచిన నీటి సరఫరా

గట్టు: మండల కేంద్రంలో భవానీమాత ఉత్సవాలు సందర్భంగా శనివారం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో గ్రామస్తులు ఖాళీ బిందెలు పట్టుకుని వ్యవసాయ పొలాల వద్దకు చేరుకున్నారు. ఓ వైపు జాతర, మరో వైపు బంధువులతో గట్టు గ్రామం కిటకిటలాడుతోంది. దీంతో నీటి సరఫరాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.